క్లుప్తంగా

ప్రజలకు సత్వర సేవలందించాలి



అమరావతి: సచివాలయంలో ప్రభుత్వం నిర్దేశించిన సేవలన్నీ ప్రజలకు సత్వరంగా అందించాలని, పదే పదే తిప్పుకోవద్దని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సిబ్బందికి సూచించారు. సోమవారం అమరావతి-2 సచివాలయంలో ఆయన అకస్మికంగా తనిఖీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సచివాలయం సేవలను విస్తృతం చేయాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది హాజరు సరిగా లేదని సరిచేసుకోకపోతే చర్యలు తప్పవన్నారు.

సాదా బైనామాలో కొనుగోలు భూములకు క్రమబద్ధీకరణ

నకరికల్లు : సాదాబైనామా పద్ధతిలో కొనుగోలు చేసిన భూములకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తహసీల్దార్ ఎస్.సురేష్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది అందరూ ఫేషియల్ యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాలని అన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా భూయాజమాన్యపత్రాలను రైతుల నుంచి సేకరించాలన్నారు. నీటితీరువా వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ

రాజుపాలెం: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వైఎస్సార్ క్రాంతి పథకం, సిడాఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ ,యువకులకు కోటప్పకొండ టీటీడీసీలో నాలుగు నెలలు శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీఎం బి. సునీత సోమవారం తెలిపారు. 19ఏళ్ల నిండి 35ఏళ్ల లోపు వయస్సు కలిగి, డిగ్రీ పాస్ ఆర్ ఫేల్ అయిన వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రముఖ ప్రైవేటు కంపెనీలో నెలకు రూ.15వేల జీతం కల్పించబడునని తెలిపారు. వివరాలకు : 9908482907ను సంప్రదించాలని కోరారు.

19న ది ఆంధ్రాబ్యాంక్ రైతు సేవా సహకార సంఘ మహాజన సమావేశం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం దుళ్ళిపాళ్ల ది ఆంధ్ర బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం మహాజన సమావేశం సంఘ ప్రాంగణంలో ఈ నెల 19న జరుగుతుందని సంఘ చైర్మన్ నల్లబోతు శివన్నారాయణ సోమవారం తెలిపారు. సంఘం యొక్క అప్పులను యూనియన్ బ్యాంక్ సత్తెనపల్లి బ్రాంచ్ వారికి ది గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నుంచి రుణం పొందిన పిదప పూర్తిగా వారి బాకీలు చెల్లించి జీడీసీసీ బ్యాంకు నుంచి సంఘమునకు అనుబంధంగా సభ్యత్వము పొంది మన సంఘ రైతులకు ది గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రుణాలు పొంది వారికి రుణాలు మంజూరు చేయుటకై చర్చించడం జరుగుతుందన్నారు. అంతేకాక చైర్మన్ ప్రవేశ పెట్టబడు ఇతర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. సభ్యులందరూ హాజరై సమావేశం విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి కేతవరం లక్ష్మీ నరసింహుని కల్యాణోత్సవాలు

బెల్లంకొండ: కేతవరం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారం నుంచి 6వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ ఈఓ గాదె రామకోటిరెడ్డి తెలిపారు. పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామాల పరిధిలో ఆలయం ఉండటంతో స్వామి వారిని సమీపంలో కొండపైన ఉంచారు. కల్యాణ వేడుకలను కొండపైనే నిర్వహించనున్నారు. 6న సాయంత్రం 4 గంటలకు స్వామి వారి దివ్య రథోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

డాక్టర్ వైఎస్సార్ యంత్రసేవ కింద ట్రాక్టర్లు



నకరికల్లు : డాక్టర్ వైఎస్సార్ యంత్రసేవ పథకం రైతులకు బహుళప్రయోజనాలు కల్పిస్తోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని నర్సింగపాడు గ్రామం సీహెచ్‌సి గ్రూపులో ఉన్న రైతులకు రెండుట్రాక్టర్‌లు, రెండు రోటోవేటర్‌లు, 4 తైవాన్ స్ప్రేయర్‌లను సోమవారం నకరికల్లులో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ యంత్రసేవ పథకం ద్వారా 40 శాతం రాయితీపై వ్యవసాయ యంత్రాలను రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్ రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీ బాషా, ఎంపీడీఓ బండి శ్రీనివాస రెడ్డి, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, జీడీసిసి బ్యాంకు మేనేజర్ మిరియాల కోటేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు వై.ప్రభాకర్, షేక్.సుభాని పాల్గొన్నారు.

‘మా నమ్మకం నువ్వే జగనన్న’పై అవగాహన



వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లకు అవగాహన కల్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

నకరికల్లు: రాష్ట్రప్రజలకు పారదర్శకమైన పాలన అందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని దేచవరం గ్రామంలోని సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు, వలంటీర్లకు మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ తరగతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7వతేదీ నుంచి 14 వరకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు సమష్టిగా పనిచేయాలన్నారు. అందరూ గ్రూపుగా ఇంటింటికి వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు కిట్‌ను పంపిణీ చేయాలన్నారు. జగనన్న నువ్వే మా నమ్మకం స్టిక్కర్‌లను సెల్‌ఫోన్లు, గోడలకు అంటించాలన్నారు. 82960 82960 నంబర్‌కు మిస్‌డ్‌కాల్ ఇవ్వాలన్నారు. జేసీఎస్ ఇన్‌చార్జి మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసి సభ్యుడు జూనెబోయిన హరీష్, వైస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బీబాషా, ఉపసర్పంచ్ భవనం రమణారెడ్డి, దొండేటి కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఈ నెల ఏడు నుంచి జరిగే ‘మా నమ్మకం నువ్వే జగనన్న’ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు పిలుపునిచ్చారు. సత్తెనపల్లి మండలం ఫణిదం, రెంటపాళ్ళ, దూళిపాళ్ల, కందులవారిపాలెం, పాకాలపాడు, కంకణాలపల్లి లోని ఏడు సచివాలయాల పరిధిలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సోమవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పురుషోత్తమరావు మాట్లాడుతూ ప్రతి గృహాన్ని సందర్శించాలన్నారు. ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని కులాలు, మతాలు, రాజకీయాలు, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న విషయాలను గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు వివరించాలన్నారు. వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ షేక్ యలవర్తిపాటి జైబూన్‌బీ, పాకాల పాడు సొసైటీ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు లు మాట్లాడారు. సమావేశం లో మండల పార్టీ నాయకులు సంకటి శ్యాంసన్, కొమెర శివశంకర్, చిలుకా జయపాల్, కొర్లకుంట నాగమల్లేశ్వరరావు, ఏకుల మత్తయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పురుషోత్త మరావు

టీడీపీ హయాంలోనే దోచుకున్నారు..దాచుకున్నారు

మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటిపై వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం

అచ్చంపేట: ఉచిత పాలసీతో ఇసుకను, నీరు-చెట్టు పథకంతో మట్టిని కొల్లగొట్టి కోట్లాది రూపాయలను టీడీపీ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, ఆయన అనుచరులు దోచుకున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై కొమ్మాలపాటి చేసిన తప్పుడు ఆరోపణలను ఖండిస్తూ.. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉచిత ఇసుక పాలసీతో జన్మభూమి కమిటీలు కోట్లాది రూపాయలు స్వాహా చేశారని, నీరు-చెట్టు పథకం ద్వారా చెరువులలో పూడిక తీసే నెపంతో మట్టిని అమ్ముకుని, ఆ పనికే బిల్లులు వసూలు చేశారని ఆరోపించారు. కృష్ణా నదిలో అడ్డగోలుగా గోతులు తవ్వి.. 28 మంది యువకుల చావుకు.. పరోక్షంగా కొమ్మాలపాటి కారణమయ్యారన్నారు. నదికి అడ్డంగా రోడ్డు వేసి ఇసుకను అక్రమంగా రవాణా చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా కొమ్మాలపాటి హయాంలో నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పనైనా చేశారా అని నిలదీశారు. కొమ్మాలపాటి హయాంలో.. గత మూడున్నరేళ్లలో అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. దమ్ము, ధైర్యం ఉంటే చర్చకు రావాలని కోరారు. చిగురుపాడు, కొత్తపల్లి గ్రామాల్లో పక్కా పర్మిట్లతోనే గ్రామస్తులకు కావలసిన మట్టిని అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై తప్పుడు, అసత్యపు ఆరోపణలు చేస్తే ప్రజల ఆగ్రహానికి గురికావలసి వస్తుందని హెచ్చరించారు. మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణా నాయక్, సర్పంచ్ కంబాల వీరబాబు, ఉప ఎంపీపీ గంగసాని బాబు, ఎంపీటీసీ తెల్లమేకల నాగరాజు, ఏఎంసీ మాజీ డైరెక్టరు అంబటి నారాయణ, జిల్లా కార్యదర్శి సుంకర శ్రీనివాసరెడ్డి, లీడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, మాజీ సర్పంచ్ టీవీఎస్ మల్లికార్జునరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు మేకల శ్రీనివాసరావు, ఆకుల కోటేశ్వరరావు, సచివాలయాల కన్వీనర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్ జయంతికి కలెక్టర్‌కు ఆహ్వానం



సత్తెనపల్లి: పట్టణంలో ఈ నెల 5న జరగనున్న బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలకు పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను ఆహ్వానించినట్లు పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు యాసారపు బాబు తెలిపారు. సోమవారం పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను నరసరావుపేట కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల అఖిల్, దర్శి కిరణ్ సాగర్, వేల్పుల రిషిక్, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మాదల(ముప్పాళ్ళ): ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని మాదల గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన శావానుజాత(24) అనే వివాహిత మహిళ గత నెల 21వ తేదీన ఇంట్లో ఎలుకలమందు తిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. గుంటూరు జీజీహెచ్‌లో మెరుగైన చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు పిల్లలున్నారు. జరిగిన ఘటనపై భర్త సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎమ్.పట్టాభిరామయ్య తెలిపారు.

డ్రైవర్ అరెస్ట్

ముప్పాళ్ళ: మండలంలోని మాదల సమీపంలోని పెట్రోల్‌బంక్ వద్ద జరిగిన ఆటో బోల్తా ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్సై ఎమ్. పట్టాభిరామయ్య సోమవారం తెలిపారు. ఈ ప్రమాదంలో చాగంటివారిపాలెంకు చెందిన కొరబండి శాంతకుమారి అనే మహిళ మృతి చెందగా మరో మహిళకు, డ్రైవర్ నవీన్‌కు గాయాలయ్యాయి. జరిగిన సంఘటనపై నవీన్ పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

మూడు క్వింటాళ్ల మిర్చి మాయం

క్రోసూరు: అందుకూరు గ్రామానికి చెందిన జంగా సుధీర్ కుమార్ అనే రైతు.. తన పొలంలో ఉంచిన మూడు క్వింటాళ్ల మిర్చి దొంగతనం జరిగిందని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ మణికృష్ణ సోమవారం తెలిపారు. వివరాలు మేరకు.. ఈ నెల 1న బాధితుడు తన పొలంలోని మిర్చి పంట కోత ముగించుకొని, సుమారు మూడు క్వింటాళ్ల మిర్చిని అక్కడే కల్లాంలో ఉంచాడు. మరుసటి రోజు వేకువ జామున తిరిగి పొలానికి వచ్చి చూడగా మిర్చి కనిపించకపోవడాన్ని గుర్తించాడు. బాధితుడి పిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక దందాపై ప్రమాణానికి సిద్ధమా..!

అమరావతి: తెలుగుదేశం పార్టీ హాయాంలో అక్రమ ఇసుక తవ్వకాలపై మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ గాని, టీడీపీ నాయకులు బహిరంగ చర్చకు, ప్రమాణం చేయటానికైన సిద్ధమా అని క్రోసూరు ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి సవాల్ విసిరారు. సోమవారం స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో ఇసుక దందా వల్ల 23మంది మరణించారని..ఈ విషయం అబద్ధమైతే.. కొమ్మాలపాటి శ్రీధర్ ప్రమాణం చేయగలరా అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరిపితే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ రూ.100కోట్ల జరిమానా విధించిన విషయం అప్పుడే మరిచిపోయారా అని గుర్తుచేశారు. కొమ్మాలపాటి శ్రీధర్ శాసన సభ్యుడిగా పనిచేసిన పదేళ్లలో అభివృద్ధి, సంక్షేమంపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇక జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు జిల్లా మొత్తం తెలియక..పోయినా..అమరావతి మండలంలో ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు. అయన మోసాలు, అక్రమాలు.. డబ్బులు ఎగ్గొట్టటం ఇంకా బాగా తెలుసునన్నారు. అలాంటి 420లకు ఎమ్మెల్యే శంకరరావుపై విమర్శలు చేసే అర్హత లేదన్నారు. ఎండ్రాయి సర్పంచ్ నాయుడు రాంబాబు, నర్సరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి నండూరి కరుణకుమార్ జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కోట హరిబాబు, మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, వైకుంఠపురం ఉప సర్పంచి గుబ్బా కృష్ణయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు అలా లక్ష్మీనారాయణ, ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, చిల్కా సాంబయ్య, వీరరాఘవయ్య, వెంగిశెట్టి పెద్ద బ్బాయి, కొండవీటి కోటేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం



గేటువద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



బృగుబండ పరీక్షా కేంద్రం ఎదుట సూచనలు ఇస్తున్న తహసీల్దార్ నగేష్, సీడీపీఓ శ్రీలత

క్రోసూరు: పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఐదు పరీక్ష కేంద్రాల్లో 926 మంది విద్యార్థులకు గాను 26 మంది గైర్హాజరయ్యారని, పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ ఏసురత్నం తెలిపారు. సత్తెనపల్లి ఎంఈఓ శ్రీనివాసరావు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిగా ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

14 మంది గైర్హాజరు..

రాజుపాలెం: గణపవరం జల్లా పరిషత్ పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో 137 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఏడుగురు గైరు హాజరయ్యారు. రాజుపాలెం జెడ్పీ పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో 211 మంది విద్యార్థులకు ఏడుగురు గైర్హాజరయ్యారు..

ప్రశాంతంగా పరీక్షలు

ముప్పాళ్ళ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మండల పరిధిలోని ముప్పాళ్ళ, నార్నెపాడు, బొల్లవరం, దమ్మాలపాడు, కేజీబీవీ పాఠశాలలకు చెందిన 187 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 184 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటిండెంట్ సిద్దయ్య తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు లు తనిఖీ చేశారు. స్పెషల్‌స్క్వాడ్ సభ్యులు పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

సత్తెనపల్లి: పదవ తరగతి పరీక్షలు సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్‌లో సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలో ఏడు సెంటర్లు, సత్తెనపల్లి మండలంలో ఐదు వెరశి 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ బందో బస్తు విధించారు. సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ కె.నగేష్, సత్తెనపల్లి సీడీపీఓ టీ. శ్రీలతలు సందర్శించారు.

ముగ్గురు గైర్హాజరు

నకరికల్లు: మండలంలో సోమవారం ప్రారంభమైన పదోతరగతి పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి కె.జ్యోతికిరణ్ తెలిపారు. జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలోని 186 మంది విద్యార్థులకు 184 మంది, విశ్వశాంతి పాఠశాలలోని 203 మంది విద్యార్థులకు గాను 202 మంది హాజరైనట్లు తెలిపారు.

బెల్లంకొండలో..

బెల్లంకొండ: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు బెల్లంకొండలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని బెల్లంకొండ, పాపాయపాలెం, చంద్రాజుపాలెం జెడ్పీ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలకు చెందిన బాలికలు మొత్తం 226 విద్యార్థులకు గాను ఏడుగురు పరీక్షకు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక తహసీల్దారు బి.నిర్మల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎస్ఐ కె.అమీర్ బందోబస్తు నిర్వహించారు.

ప్రశాంతంగా పరీక్షలు ప్రారంభం

అమరావతి: అమరావతిలోని రెండు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్‌లో 239 మంది, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 315 మంది విద్యార్థులకు గాను మొత్తంగా ఆరుగురు గైర్హాజరైనట్లు ఎంఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

వరిలో యాజమాన్య పద్ధతులే కీలకం



వరిపంటను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సీహెచ్ వరప్రసాద్, అధికారులు

నకరికల్లు: పాలుపోసుకుంటున్న వరికి అకాలవర్షాల ప్రభావంతో బ్యాక్టీరియల్ ఆకుఎండుతెగులు ఆశించే ప్రమాదముందని నివారణకు యాజమాన్యపద్ధతులే కీలకమని ఏరువాకకేంద్రం ప్రధాన సమన్వయకర్త, శాస్త్రవేత్త సీహెచ్ వరప్రసాద్ సూచించారు. మండలంలోని దేచవరం గ్రామంలోని వరిపొలాలను సోమవారం పరిశీలించారు. బ్యాక్టీరియల్ తెగులు సోకిన పొలాల నుంచి కాలువల ద్వారా నీటిని బయటకు వెళ్లగట్టాలన్నారు. డీడీఏ ఎం.శివకుమారి. ఏడిఏ మస్తానమ్మ, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, ఉపసర్పంచ్ భవనం రమణారెడ్డి, ఎంపీఈఓలు కె.రవిబాబు, కె.హనుమంతరావు, రైతులు పాల్గొన్నారు.

మంచి చేసే వారికే మద్దతివ్వండి

‘గడప గడప’లో కోరిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



చామర్రు రోడ్డులో ఇంటింటికి తిరిగి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: ‘కుల, మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నాం.. సచివాలయ వ్యవస్థతో పల్లెకు పాలనను తీసుకొచ్చాం..వలంటీర్లతో ఇంటి వద్దకే లబ్ధిని చేరుస్తున్నాం..అర్హతున్న వాళ్లకు ఇప్పటి వరకు ఎక్కడా అన్యాయం జరగలేదు.. మంచి చేసిన వారి మద్దతివ్వండి..మరింత అభివృద్ధి చేసే మరో అవకాశం ఇవ్వండి’.. అంటూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గడప గడపకు తిరుగుతూ ప్రజలను కోరారు. సోమవారం అచ్చంపేటలోని పోలీస్ స్టేషన్‌రోడ్డు, చామర్రు రోడ్డు, లక్ష్మీనగర్‌లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేశారు. అందిన లబ్ధిని తెలుసుకున్నారు. సంక్షేమ లబ్ధి పత్రాలను అందజేసి, వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సావధానం విని, పరిష్కార మార్గాలను చూపించారు. మంచి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపబోతున్నామని తెలిపారు. కృష్ణానది నుంచి ఇంటింటికీ మంచి నీళ్ల సరఫరా చేసే బృహత్తర కార్యక్రమం చేపట్టబోతున్నట్లు వివరించారు. అంతర్గత రోడ్లు, సైడు కాలువల నిర్మించనున్నట్లు చెప్పారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తేవాలని ఎమ్మెల్యే శంకరరావు ప్రజలను కోరారు. ప్రజా పంపిణీలో అవకతవకలపై కూడా ఆయన ఆరా తీశారు. జనవరి నుంచి రూ.3వేలు ఇవ్వనున్నట్లు అవ్వతాతలకు వివరించి, మారి మద్దతు కోరారు. ప్రతిపక్షాల మాటలు విని మోసపోవద్దని, మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకుందామని పిలుపునిచ్చారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, ఉప ఉంపీపీ గంగసానిబాబు, సర్పంచ్ కంబాల వీరబాబు, ఎంపీటీసీలు తెల్లమేకల నాగరాజు, షేక్ మెహిద్దీన్, వ్యవసాయ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు తుమ్మా చిన్నపరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు రామిశెట్టి పెద యలమందయ్య, డీలరు సుభాని, ఉప సర్పంచ్ షేక్ జాని, మార్కెట్ యార్డు డైరెక్టర్లు మేకల శ్రీనివాసరావు, ఆకుల కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సుంకర శ్రీనివాసరెడ్డి, లీడ్ క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, మాజీ సర్పంచ్ టీవీఎస్ మల్లికార్జునరావు, బీసీ సెల్ కన్వీనర్ బీరువాల జాని, మైనార్టీ నాయకులు కమల్ సైదా, బీసీ నాయకులు చంటి, బాజి, మస్తాన్, జాలయ్య, వల్లెం శ్రీను, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టుతో రక్త హీనత లేని రాష్ట్రంగా ఏపీ
- మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్ మీరాన్
- సత్తెనపల్లి 27వ వార్డులో పోషణ్ పక్షోత్సవాల ముగింపు



కిట్లు పంపిణీ చేస్తున్న నాగుర్‌మీరాన్, కమిషనర్ షమ్మి, మౌలాలి, డాక్టర్ అలీ

సత్తెనపల్లి: వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్టుతో రక్త హీనత లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉండవచ్చని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్ అన్నారు. పట్టణంలోని 27వ వార్డ్‌లో పోషణ్ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాగుర్‌మీరాన్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారాన్ని తల్లులు, పిల్లలు సద్వినియోగం చేసుకుని రక్త హీనతలేని రాష్ట్రంగా ఉండాలన్నారు. తల్లులకు బల వర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్న ప్రభుత్వానికి ఎల్ల వేళల రుణపడి ఉండాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖలో పోషకాహారం పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజారోగ్యమే పరమావధిగా ప్రభుత్వం పోషకాహారం అందించేందుకు కోట్లాది రూపాయలు హెచ్చిస్తోందన్నారు. చిన్నారులు మొదలుకొని వృద్ధుల వరకు అందరి ఆరోగ్య రక్షణకు పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సంపూర్ణ పోషణ ఆహారంపై అవగాహన కల్పించేలా ఈనెల 20 నుంచి చేపట్టిన పోషణ పక్షోత్సవాలు సోమవారంతో ముగిశాయన్నారు. మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ షేక్ మౌలాలి, వడ్డవల్లి అర్బన్ యూపీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ షేక్ మొహమ్మద్ అలీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీ.ప్రమీల లు మాట్లాడారు. తల్లులకు పలు సూచనలు చేసి సంపూర్ణ పోషన్ కిట్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యపై శ్రద్ధ తీసుకోవాలి

రాజుపాలెం: ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ టి.శ్రీలత తెలిపారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో పౌష్టిక ఆహారంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు సూపర్‌వైజర్లకు పోషణ పక్వాడా కార్యక్రమంపై అవగాహన సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర బాలల హక్కుల కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి మాట్లాడుతూ బాలల హక్కుల గురించి వారి సంరక్షణ, పౌష్టికాహారాల గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై కార్యకర్తలు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ముందుగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలను అందించే ఆహార పదార్థాలను వివిధ రకాల చిరుధాన్యాలు, ఆకు కూరలతో తయారు చేసిన పదార్థాలను ప్రదర్శించి వాటి గురించి వివరించడం జరిగింది. కార్యక్రమంలో ఏసీడీ పీవో టి.సంతోషకుమారి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

అచ్చంపేట: పశువులలో తరచుగా వచ్చే గాలికుంటు వ్యాధిపట్ల పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ పి.స్వాతీదేవి పేర్కొన్నారు. స్థానిక పశు వైద్యశాల ఆవరణలో గాలికుంటు వ్యాధి వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కంబాల వీరబాబు, వైస్ ఎంపీపీ గంగసాని బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆమె మాట్లాడారు. ముందుగా గాలికుంటు వ్యాధి లక్షణాలను గుర్తించాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా పశువులు మేత, నీరు తీసుకోకపోవడం, పాల దిగుబడి గణనీయంగా తగ్గడం, నోటి పుండ్లు, చొంగ కార్చడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యశాలకు తీసుకురావాలన్నారు. శిబిరంలో 43 తెల్ల పశువులకు, 116 గేదెలకు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు చెప్పారు. ఈ నెల 10వ తేదీ వరకు టీకాలు వేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యశాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయండి



అచ్చంపేటలో మాట్లాడుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు

అచ్చంపేట: కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు ఈ నెల 14 నుంచి 30 వరకు సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో జరగనున్న ప్రజా పోరు పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణతో కలసి గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రజలంతా ఏకం కావాలన్నారు. దేశ్ బచావో, మోది హటావో అనే నినాదంతో జరిగే ప్రజా పోరులో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వున్నా కోటేశ్వరరావు, చెలికాని అశోక్, బండారుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.